సాక్షి తిరుపతి

శనివారం । 17 । మే । 2025



ఒప్పించి కాదు నొప్పించి!
టీచర్ల సమస్యలు పరిష్కరించకుండా బదిలీలు, ఉద్యోన్నతుల్లో ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలపై మండి పడుతున్నారు. - IIలో



దర్గాగా దోపిడీ
కూటమి ప్రభుత్వంలో ప్రకృతి సంపదను టీడీపీ నేతలు ఇష్టారాజ్యంగా దోపిడీకి పాల్పడుతున్నారు. - IIలో



తిరుచ్చిపై సిరులతల్లి విహారం
తిరుచానూరు పద్మావతీ అమ్మవారు శుక్రవారం బంగారు తిరుచ్చి వాహనంపై విహరించి భక్తులను కటాక్షించారు. - IIలో

న్యూస్‌రీల్

డెంగీపై అవగాహన



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి

తిరుపతి తుడా : జిల్లా ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జాతీయ డెంగీ అవగాహన దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్వీ మెడికల్ కళాశాల నుంచి స్విమ్స్ ఆసుపత్రి సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 59 డెంగీ కేసులు జిల్లాలో నమోదు అయ్యాయని తెలిపారు. వర్షాకాలంలో డెంగీ కేసులు పెరగడం వల్ల ప్రజలకు అవగాహన కల్పించడం కోసం ఈ డెంగీ దినంను ఏటా జరుపుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమలో జిల్లా అధికారులు డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి, మలేరియా అధికారి డాక్టర్ రూప్ కుమార్, డీపీఎంఒ శ్రీనివాసులు, డాక్టర్ మురళీ కృష్ణ, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షకు 760 మంది గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రథమ సంవత్సరం, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఫిజిక్స్, ఎకనామిక్స్ సబ్జెక్టుల్లో పరీక్షను నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 64 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన ప్రథమ సంవత్సర పరీక్షకు జనరల్, ఒకేషనల్‌లో కలిపి 10,281 మందికి 658 మంది విద్యార్థులు గైర్హాజరవ్వడంతో 9,623 మంది పరీక్షను రాశారు. అలాగే ద్వితీయ సంవత్సర పరీక్షకు 24 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు జనరల్, ఒకేషనల్‌లో కలిపి 1,570 మందికి 102 మంది గైర్హాజరవ్వడంతో 1,468 మంది విద్యార్థులు పరీక్షను రాసినట్లు ఆర్ఐఓ జీవీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

టీడీపీ గూండాలపై ఎస్పీ చర్యలు తీసుకోవాలి



ఎస్పీని కలిసి బయటకు వస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, న్యాయవాదులు

తిరుపతి మంగళం : తిరుపతి 50వ డివిజన్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ బోకం అనిల్‌కుమార్‌పై దాడి చేసిన టీడీపీ గూండాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లాని బాబు, కార్పొరేటర్ కోటూరు ఆంజినేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం తిరుపతి జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఎస్పీ హర్షవర్ధన్‌రాజును వైఎస్సార్‌సీపీ నాయకులు, పార్టీ లీగల్ సెల్ న్యాయవాదులు కలిసి ఫిర్యాదు చేశారు. తమ కార్పొరేటర్ అనిల్‌ను చంపడానికి ప్రయత్నించారని, అందుకు తగిన విధంగా 307 కేసు నమోదు చేయాలని పార్టీ నాయకులు ఎస్పీని కోరారు. మరోసారి ఇలా జరగకుండా అనిల్‌కు రక్షణ కల్పించాలని పార్టీ నాయకులు కోరారు. ఎస్పీని కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గీతాయాదవ్, పార్టీ నాయకులు మద్దాలి శేఖర్, అనిల్‌రెడ్డి, కుప్పయ్య, న్యాయవాది చంద్ర, కార్పొరేటర్ అనిల్‌కుమార్ తల్లి కుప్పమ్మ, అక్క కాటమ్మ ఉన్నారు.

ముగిసిన వీసీఐ బృందం పర్యటన

తిరుపతి సిటీ : ఎస్వీ వెటర్నరీ కళాశాలలో వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (వీసీఐ) బృందం పర్యటన శుక్రవారం ముగిసింది. మూడు రోజులుగా వీసీఐ బృందం కళాశాలలోని పలు విభాగాలు, క్లినిక్‌లను, ల్యాబ్‌లను, కళాశాలలోని మౌలిక సదుపాయాలను పరిశీలించింది. సమస్యలు, వసతుల కల్పనపై అధ్యాపకులు, విద్యార్థులతో చర్చించారు. బృందం పరిశీలించిన అంశాలపై నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నారు.

తిరుపతి ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికుల భద్రత గాల్లో దీపంలా మారింది. ఇక్కడికి రాష్ట్ర వ్యాప్తంగా యాత్రికులు వస్తుంటారు. రాత్రిపూట ప్రయాణికులు బస్టాండులో ఉన్నంత సేపు భయ భయంగా గడపాల్సిన దుస్థితి దాపురించింది. ఎటు వైపు నుంచి దొంగలు వచ్చి మీద పడతారో.. ఏ వైపు నుంచి గంజాయి మత్తులో ఏం చేస్తారోనని ప్రాణాలు అరచేతిలో పట్టుకొని బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు.. మరుగుదొడ్లకు వెళ్లాలంటేనే ఇక నరకానికి పోయినంత పని అవుతోంది.. ముక్కుపుటాలు అదిరేలా దుర్వాసన వెదజల్లుతున్నాయి. సీసీ కెమెరాలు ఉన్నా లేనట్లే.. తిరుపతి బస్టాండులో సమస్యలు తాండవిస్తుండంతో ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతం.



బస్టాండులో భయం.. భయం

- ప్రయాణికుల భద్రత ప్రశ్నార్థకం
- నిఘానేత్రం.. నామమాత్రం
- ప్రయాణికులే లక్ష్యంగా చోరీలు
- ఫోన్లు, బ్యాగ్‌లు, మెడలో చైన్‌లే టార్గెట్
- రాత్రివేళలో చెలరేగుతున్న గంజాయ్ బ్యాచ్
- ప్రశ్నిస్తే దాడులు చేస్తున్నారంటున్న ఉద్యోగుల ఆవేదన
- ఆందోళనలో ఆర్టీసీ ప్రయాణికులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

తిరుపతి అర్బన్ : ఆధ్యాత్మిక నగరంలోని ఆర్టీసీ బస్టాండుల్లో భద్రత కొరవడింది. రాత్రీ పగలు తేడా లేకుండా చోరీలు జరుగుతున్నాయి. ప్రధానంగా రాత్రి సమయంలో గంజాయి బ్యాచ్ ఏడుకొండల బస్టాండ్‌తో పాటు శ్రీహరి, శ్రీనివాస, పల్లెవెలుగు బస్టాండ్లలలో బీభత్సం సృష్టిస్తున్నారు. ఎవరు మీరు ఎందుకు బస్టాండుల్లో ఉన్నారు..ఏ ఊరికి వెళ్లాలి అని ప్రశ్నించడానికి ఆర్టీసీ కంట్రోలర్స్‌కు ధైర్యం చాలడం లేదు. దీంతో ప్రయాణికులు తమ బస్సు వచ్చే వరకు బిక్కుబిక్కుమంటూ ఉండాల్సిన దుస్థితి దాపురించింది. కొందరు బిచ్చగాళ్ల వలే ఉంటూ ఒక్కసారిగా ప్రయాణికులను దోపిడీ చేస్తున్నారు. బస్టాండ్‌లోని సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేయడం లేదు. దీంతో చోరీల సమాచారం పోలీసులకు తెలియజేసినా ప్రయోజనం ఉండడం లేదు.

కంపుకొడుతున్న మరుగుదొడ్లు

తిరుపతి బస్టాండ్‌లో వసతులు అధ్వాన్నంగా ఉన్నాయి. ఓ వైపు పలు మరుగుదొడ్లు మూతవేశారు. ఉన్న మరుగుదొడ్లు కంపుకొడుతున్నాయి. తాగునీటి సమస్యలు తప్పడం లేదు. పలు కొళాయిలు పనిచేయడం లేదు. పలు ఫ్యాన్లు తిరగడం లేదు. కుర్చీలు అంతంతమాత్రమే ఏర్పాటు చేశారు. మరోవైపు శ్లాబ్ నుంచి పెచ్చులు ఊడిపడుతున్నాయి. ఈ సమస్యలు చాలదంటూ చోరీలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ తమ బస్సు వచ్చే వరకు భయ భయంగా ఉంటున్నారు.

ఆందోళనతో గడుపుతున్నాం



“ జిల్లా కేంద్రమైన తిరుపతి నగరంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు సరైన భద్రత లేదు. దీంతో ఆందోళన తప్పడం లేదు. ప్రధానంగా సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేయడం లేదు. దీంతో దొంగలను గుర్తించడం కష్టంగా మారుతోంది. ప్రతి ప్లాట్‌ఫాం వద్ద ఒక సీసీ కెమెరాను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

– రెడ్డప్ప, ప్రయాణికుడు, తిరుపతి

ప్రయాణికులకు భద్రత కల్పించాలి



ప్రధానంగా తిరుపతి బస్టాండ్‌లో గంజాయి, అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేయాల్సి ఉంది. గంజాయి తాగి పలువురు వ్యక్తులు బస్టాండల్లో ఉంటున్నారు. ప్రధానంగా రాత్రి సమయంలో భయం భయంగా బస్టాండ్లలో ఉండాల్సిన దుస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు స్పందించి భద్రత కల్పించాలని కోరుతున్నాం.

–మణి, ప్రయాణికుడు, తిరుపతి

కనీస వసతులు లేవు



తిరుపతి బస్టాండ్‌లో దుకాణదారులు ఇష్టారాజ్యంగా ధరలు పెంచి వస్తువులను విక్రయిస్తున్నారు. వాటిని అదుపు చేయడం లేదు. తమకు కేటాయించిన స్థలంలో కాకుండా అదనపు స్థలాన్ని ఆక్రమించుకుని వ్యాపారం చేస్తున్నారు. మరుగుదొడ్లు కంపుకొడుతున్నాయి. తాగునీటి కొళాయిలు సక్రమంగా లేవు.

– వినోద్, ప్రయాణికుడు, తిరుపతి

ఆర్టీసీ జిల్లా సమాచారం

డిపోలు 11	సర్వీసులు 814
విద్యుత్ సర్వీసులు 100	ఉద్యోగులు 4255
రోజు వారి ప్రయాణికులు 4.50 లక్షలు	రోజువారీ రాబడి రూ.1.60 నుంచి 1.70 కోట్లు
దుకాణాల సంఖ్య 504	దుకాణాల రాబడి రూ.48 కోట్లు
కార్గో రాబడి 75 లక్షలు	

అలంకారప్రాయంగా నిఘా నేత్రాలు



తిరుపతి సెంట్రల్ బస్టాండ్ ఆవరణంలోని శ్రీహరి బస్టాండ్‌లో 17 సీసీ కెమెరాలు, శ్రీనివాస బస్టాండ్‌లో 11 సీసీ కెమెరాలు, ఏడుకొండల బస్టాండ్‌లో 5 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. మొత్తంగా 33 సీసీ కెమెరాలు ఉన్నాయి. అందులో 50 శాతం మేరకు పనిచేయడం లేదని, పలు సీసీ కెమెరాలు దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో కొత్త సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడానికి ఆర్టీసీ అధికారులు దాతల వద్దకు పది రోజులుగా తిరుగుతున్నట్లు సమాచారం. రెండేళ్ల కిందట కార్గో పార్సిల్ విభాగానికి కడప నుంచి రూ.2 లక్షల విలువ చేసే పట్టుచీరలు వచ్చాయి. వాటిని చోరీ చేశారు. వెంటనే సీసీ కెమెరాల ద్వారా పట్టుకున్నారు. ఎంతో కీలకమైన సీసీ కెమెరాలను ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో అలంకారప్రాయంగా మారుతున్నాయి. ఇటీవల విశాఖపట్నం నుంచి 30 కిలోల గంజాయిని తిరుపతి బస్టాండ్ నుంచి తమిళనాడుకు తరలించే క్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు పట్టుకున్న సంగతి తెలిసిందే. తిరుపతి బస్టాండ్ ఆధారంగా గంజాయి వ్యాపారం సాగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వాటిని పోలీసులు కట్టడి చేయాల్సి ఉంది.

అనిల్‌పై దాడి చేసిన టీడీపీ నేతలను అరెస్టు చేయాలి





ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్పొరేటర్ అనిల్‌కుమార్‌ను పరామర్శిస్తున్న భూమన, మేయర్ శిరీష

- న్యాయం జరగకపోతే ఉద్యమమే
- ఆసుపత్రికి వెళ్లి పరామర్శించిన భూమన కరుణాకర రెడ్డి

తిరుపతి మంగళం : లోకేష్ రెడ్‌బుక్ పాలనలో కూటమి నేతలు చేస్తున్న అరాచకాలకు ప్రజలే చరమగీతం పాడుతారని, కార్పొరేటర్ బోకం అనిల్‌కుమార్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన టీడీపీ నాయకులపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయకపోతే రోడ్లపైకి వచ్చి ఉద్యమాలు చేస్తామని చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి హెచ్చరించారు. తిరుపతి-కరకంబాడి మార్గంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అనిల్‌కుమార్‌ను శుక్రవారం భూమన కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. కుటుంబానికి మీకు అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. పోలీస్ వ్యవస్థపై తనకు ఎంతో గౌరవం, నమ్మకం ఉందని, ఆ నమ్మకంతోనే కార్పొరేటర్ అనిల్‌పై దాడి చేసిన టీడీపీ నాయకులపై చర్యలు తీసుకుని న్యాయం చేస్తారని ఆశిస్తున్నామని భూమన అన్నారు.

చంద్రబాబువి కక్ష రాజకీయాలు


- ఈ అరెస్టులు అప్రజాస్వామికం
- హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం
- వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే డైవర్షన్ పాలిటిక్స్
- తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి ధ్వజం



తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి

తిరుపతి సిటీ: ముఖ్యమంత్రి చంద్రబాబు చేసేవన్నీ కక్ష రాజకీయాలని తిరుపతి పార్లమెంటు సభ్యుడు మద్దిల గురుమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. మాజీ ఐఏఎస్ అధికారి ధనుంజయ్ రెడ్డి, మాజీ ప్రభుత్వ అధికారి కృష్ణమోహన్ రెడ్డి అరెస్టును ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ అరెస్టులు అప్రజాస్వామికమని మండిపడ్డారు. ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీల అమల్లో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఈ ప్రభుత్వం పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతోందన్నారు. విపక్ష పార్టీ నేతలు, ప్రభుత్వాధికారులతో పాటు మాజీ అధికారులను లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. లిక్కర్ వ్యవహారంలో ఆధారాలు లేకపోయినా అరెస్టులు చేస్తున్నారని తెలిపారు. కూటి ప్రభుత్వ అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని సరైన సమయంలో చంద్రబాబు ప్రభుత్వానికి బుద్ధి చెప్పడం ఖాయమని పేర్కొన్నారు.

101వ ప్రయోగానికి సిద్ధం



- రేపు నింగిలోకి పీఎస్ఎల్‌వీ సీ 61
- నేడు కౌంట్‌డౌన్ ప్రారంభం
- రేపు ఉపగ్రహాన్ని రోదసిలోకి పంపనున్న వైనం
- రాకెట్ అనుసంధాన దృశ్యాలను విడుదల చేసిన ఇస్రో

సూళ్లూరుపేట : భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి ఆదివారం ఉదయం 5.59 గంటలకు పీఎస్ఎల్‌వీ సీ 61 ఉపగ్రహ వాహక నౌకను ప్రయోగించేందుకు సర్వం సిద్ధం చేశారు. ఈ ప్రయోగానికి సంబంధించి శనివారం ఉదయం 7.59 గంటలకు కౌంట్ డౌన్ ప్రక్రియను ప్రారంభించనున్నారు. షార్‌లోని మొదటి ప్రయోగ వేదికకు సంబంధించి పీఎస్ఎల్‌వీ ఇంటిగ్రేషన్ ఫెసిలిటీ భవన్, ఎంఎస్‌టీలో రాకెట్ అనుసంధానం చేసిన కొన్ని దృశ్యాలను ఇస్రో అధికారికంగా శుక్రవారం ఇస్రో విడుదల చేసింది. 17.65 నిమిషాల్లో ప్రయోగాన్ని పూర్తి చేసే విధంగా ఇస్రో శాస్త్రవేత్తలు డిజైన్ చేశారు. షార్ నుంచి 101వ ప్రయోగానికి సిద్ధమవుతుండడం విశేషం.



రాకెట్ మొదటి దశను కేరళలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌లో డిజైన్ చేసి తీసుకొచ్చి ఇక్కడ అనుసంధానం చేస్తారు. ఈ దశ 20 మీటర్లు పొడవు 2.8 మీటర్లు వ్యాసార్థం కలిగి ఉంటుంది. ఈ దశలో రాకెట్ నింగికి దూసుకెళ్లడానికి 139 టన్నుల ఘన ఇంధనాన్ని ఇందులో నింపి ప్రయోగిస్తారు.



ప్రయోగ సమయంలో రాకెట్ 321 టన్నుల బరువు ఉంటుంది. రాకెట్‌కు చుట్టూరా ఆరు స్ట్రాపాన్ బూస్టర్లను అమర్చుతారు. ఒక్కో స్ట్రాపాన్ బూస్టర్‌లో 12.2 టన్నుల ఘన ఇంధనాన్నే నింపుతారు. మొత్తం కలిపి 73.2 టన్నుల ఇంధనాన్ని నింపుతారు. అంటే మొదటి దశలో 212.2 టన్నుల ఘన ఇంధనంతో ప్రయోగాన్ని ప్రారంభిస్తారు.



రాకెట్ రెండోదశ 12.8 మీటర్ల పొడవు 2.8 మీటర్ల వెడల్పు వ్యాసార్థంలో పీఎస్-2 దశ ఉంటుంది. మొదటి దశకు పై భాగంలో దీన్ని అనుసంధానం చేస్తారు. పీఎస్-2 మోటార్‌లో 41 టన్నుల ద్రవ ఇంధనాన్ని నింపుతారు. ఈ దశను వీఎస్ఎస్‌సీలోనే తయారు చేస్తారు.



మూడో దశ 3.6 మీటర్లు పొడవు 2 మీటర్లు వెడల్పు వ్యాసార్థంలో ఉంటుంది. మూడో దశలో 7.65 టన్నుల ఘన ఇంధనం నింపి ప్రయోగిస్తారు. ఈ దశను రెండో దశకు పైభాగంలో అనుసంధానం చేస్తారు.



నాలుగోదశ 2.5 మీటర్లు పొడవు 1.34 మీటర్లు వెడల్పు వ్యాసార్థంలో ఉంటుంది. ఈ దశలో 2.5 ద్రవ ఇంధనం నింపుతారు. ఈ దశతోనే ఉపగ్రహాలను రోదసీలోకి నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశ పెడుతుంది. మూడో దశకు పై భాగంలో నాలుగోదశను అనుసంధానం చేస్తారు.



పీఎస్ఎల్‌వీ ఇంటిగ్రేషన్ ఫెసిలిటి భవన్‌లో నాలుగు దశల రాకెట్ అను సంధానం పూర్తి చేసి ఎంఎస్‌టీ టవర్‌కు తరలిస్తున్న శాస్త్రవేత్తలు



ఎంఎస్‌టీ టవర్‌లో రాకెట్‌కు నాలుగో దశకు పై భాగంలో 1696.24 కిలోల బరువు కలిగిన ఈఓఎస్-09 ఉపగ్రహాన్ని సిద్ధం చేసిన దృశ్యం



రాకెట్ నాలుగోదశకు పై భాగంలో ఈఓఎస్-09 ఉపగ్రహాన్ని అమర్చిన వైనం



ఈఓఎస్-09 ఉపగ్రహాన్ని పొందికగా అమర్చి హీట్ షెల్డ్ క్లోజ్ చేసిన దృశ్యం



నాలుగు దశల రాకెట్ అనుసంధానం పూర్తి చేసుకుని నింగి వైపునకు దూసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్న పీఎస్ఎల్‌వీ సీ 61 ఉపగ్రహ వాహకనౌక

మామిడికి గిట్టుబాటు ధర కల్పిస్తాం



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్ : మామిడి పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్‌తో పాటు అధికారులు, వ్యాపారులు, ఫ్యాక్టరీ యజమానులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రానున్న మామిడి దిగుబడిని ఒక్కసారిగా కోతలు చేయకుండా దశల వారీగా చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని ఉద్యానశాఖ అధికారి దశరథరామిరెడ్డిని ఆదేశించారు. ఓ వైపు రైతులు, మరోవైపు వ్యాపారులు ఇంకో వైపు ఫ్యాక్టరీలకు న్యాయం చేసేలా నిర్ణయాలు తీసుకోవాలని అధికారులకు వెల్లడించారు. ఆ మేరకు ఓ నివేదిక తయారు చేసి తమకు సమర్పించాలని ఉద్యానశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వ్యాపారులు మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాల నుంచి విరివిగా జిల్లాకు మామిడి పండ్లు వస్తున్నాయని చెప్పారు. దాంతో తాము నష్టపోతున్నామని, వాటిని రాకుండా అడ్డుకట్ట వేయాలని కోరారు. అన్ని అంశాలను పరిశీలించి అందరికీ న్యాయం చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారులతో పాటు మైక్రో ఇరిగేషన్ అధికారి సతీష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అక్రమాలు అరికట్టాలని ఎస్పీకి ఫిర్యాదు

సైదాపురం : వెంకటగిరి నియోజకవర్గం సైదాపురంలో జరుగుతున్న అక్రమాలపై వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరర్‌రెడ్డి నెల్లూరు జిల్లా ఎస్పీ కృష్ణకాంత్‌ను శుక్రవారం కలసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. సైదాపురం మండలంలో అనుమతి లేకుండా పేలుడు పదార్థాలు వాడుతున్నట్లు ఆరోపించారు. బయట ప్రాంతం నుంచి రౌడీలు వచ్చి సైదాపురంలో మకాం వేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. నెల్లూరులో కత్తుల సంప్రదాయం పెరిగిపోతుందన్నారు. సైదాపురంలో అక్రమ మైనింగ్ వద్ద నెల్లూరు నుంచి వెళ్లి రౌడీయిజం చేస్తున్నట్లు ఆరోపించారు. ఈ మేరకు ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

పెంచలకోనలో అస్థిపంజరం లభ్యం

రాపూరు : రాపూరు మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని వాటర్‌ఫాల్స్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి అస్థిపంజరంను శుక్రవారం పోలీసులు గుర్తించారు. పోస్టు మార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు పెంచలకోనలో వాటర్ ఫాల్స్ సమీపంలో సుమారు 5, 6 నెలల వ్యవధిలో వ్యక్తి ఉరి వేసుకొని మృతి చెంది ఉండొచ్చని భావిస్తున్నట్లు తెలిపారు.

తిరుచ్చిపై సిరులతల్లి విహారం

చంద్రగిరి : తిరుచానూరు పద్మావతీదేవి శుక్రవారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై విహరించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణ ముఖ మండపం వద్ద స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం జరిపించారు. సాయంత్రం ఆలంకార మండపంలో వేడుకగా ఊంజల్ సేవ చేపట్టారు. అనంతరం సర్వాలంకార భూషితులైన శ్రీవారి దేవేరిని బంగారు తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చి మాడ వీధుల్లో ఊరేగించారు.

శ్రీవారి దర్శనానికి 14 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. క్యూకాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ శిలాతోరణం వద్దకు చేరుకుంది. గురువారం అర్ధరాత్రి వరకు 63,208 మంది స్వామిని దర్శించుకున్నారు. 32,951 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.72 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 14 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

పట్టుబట్టారు.. సాధించారు

ఏపీ ఈసెట్ ఫలితాల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో ర్యాంకుల పంట పండించారు. తల్లిదండ్రుల కష్టాన్ని చూసిన విద్యార్థులు వారి మోములో చిరునవ్వులు చూడాలని కష్టాలకు ఎదురీది అనుకున్న లక్ష్యాన్ని సాధించారు. ఈ మేరకు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థులతో సాక్షి ముచ్చటించింది.. వారి అభిప్రాయాలు ఇలా..

– తిరుపతి ఎడ్యుకేషన్


ఎం.ప్రత్యూష, 11వ ర్యాంకు, మెకానికల్ విభాగం


కె.రఘు, 6వ ర్యాంకు, సివిల్ ఇంజనీరింగ్

సివిల్స్ సాధించడమే లక్ష్యం



మా నాన్న నారాయణ తిరుపతిలో ఆటో డ్రైవరు. ఇంటర్ తరువాత ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రెండేళ్ల ఫార్మసీ ఇన్ డిప్లొమో కోర్సును పూర్తి చేశా. ఏపీఈసెట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయి మొదటి ర్యాంకు సాధించా. నాలుగేళ్ల కోర్సు అయిన బీఫార్మసీ ద్వితీయ సంవత్సరంలో నేరుగా ప్రవేశం పొందనుండడం ఆనందంగా ఉంది. బీఫార్మసీ తరువాత సివిల్స్ సాధిస్తా.

– ఎ.కీర్తి, రాష్ట్ర స్థాయి మొదటి ర్యాంకు, ఫార్మసీ విభాగం

వ్యవసాయం చేసి చదివించారు..



డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కావడమే తన ముందున్న లక్ష్యం. ఏపీఈసెట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 6వ ర్యాంకు సాధించా. మాది కడప సమీపంలోని ఖాజీపేట. మానాన్న శ్రీనివాసు వ్యవసాయం చేస్తూ కష్టపడి చదివించారు. నేను తిరుపతిలోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమో ఇన్ ఫార్మసీ చదివా.

– వీవీఎస్ఎస్ తరుణ్, రాష్ట్ర స్థాయి 6వ ర్యాంకు, ఫార్మసీ విభాగం

డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కావాలని..



ఏపీఈసెట్ ఫలితాల్లో 7వ ర్యాంకు సాధించా. మానాన్న రమేష్‌బాబు చిన్న కిరాణం నడిపిస్తూ చదివిస్తున్నారు. ఇంటర్ తరువాత పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమో ఇన్ ఫార్మసీ పూర్తి చేశా. ఈసెట్ ఫలితాల్లో బీఫార్మసీకి అర్హత సాధించా. బీఫార్మసీ అనంతరం డ్రగ్ ఇన్‌స్పెక్టరుగా రాణించడమే తన లక్ష్యం.

– ఎస్.సుప్రజ, 7వ ర్యాంకు, ఫార్మసీ విభాగం

సివిల్ ఇంజినీర్‌గా



ఏపీఈసెట్‌లో 4వ ర్యాంకు సాధించా. మానాన్న కృష్ణమూర్తి తిరుపతిలోని ఓ ప్రైవేటు హోటల్‌లో చెఫ్‌గా పని చేస్తూ చదివించారు. తిరుపతిలోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్ బ్రాంచ్‌ను సాధించా. బీటెక్‌లో చేరి మంచి సివిల్ ఇంజినీరుగా రాణించడమే తన లక్ష్యం.

–ఎ. శ్రీవెంకట్, 4వ ర్యాంకు, సివిల్ విభాగం

సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించాలని..



ఏపీఈసెట్ సిరామిక్ టెక్నాలజీ ఫలితాల్లో మొదటి ర్యాంకు సాధించా.మాది శ్రీకాళహస్తి మండలం, ఎనగలూరు. మానాన్న వెంకటసుబ్బయ్య వ్యవసాయం కుటుంబం. గూడూరులోని సిరామిక్ టెక్నాలజీ కళాశాలలో డిప్లొమో పూర్తి చేశా. సాఫ్ట్‌వేర్‌గా రాణించాలన్నదే తన ఆశయం.

– కార్తిక్, స్టేట్ ఫస్ట్, సిరామిక్ టెక్నాలజీ

డీఎస్సీకి 26,501 మంది దరఖాస్తు

చిత్తూరు కలెక్టరేట్ : డీఎస్సీ పరీక్షకు ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 26,501 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నోటిఫికేషన్ ప్రకారం ఈ నెల 16వ తేదీతో దరఖాస్తులు చేసుకునేందుకు గడువు ముగిసింది. జిల్లాలో 1,478 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేశారు. అయితే దరఖాస్తులకు గడువు ముగిసేనాటికి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 26,501 మంది దరఖాస్తులు చేసుకున్నారు. గత నెల 20వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

మహిళలే అత్యధికం

జిల్లా వ్యాప్తంగా డీఎస్సీ పరీక్షకు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థుల్లో మహిళలే అత్యధికంగా ఉండడం విశేషం. 26,501 మంది దరఖాస్తు చేసుకోగా అందులో మహిళలు 16,348 మంది, పురుషులు 10,153 మంది ఉన్నారు. అయితే కొందరు అభ్యర్థులు తమ అర్హతలను బట్టి పలు సబ్జెక్టులకు దరఖాస్తులు చేసుకున్నారు. ఆ విధంగా జిల్లాలో 45,221 దరఖాస్తులు నమోదయ్యాయి.

ఒక్క పోస్టుకు 31 మంది వరకు పోటీ

అందిన దరఖాస్తుల ప్రకారం ఒక్కో పోస్టుకు 31 మంది అభ్యర్థులు పోటీ పడనున్నారు. ఈ డీఎస్సీకి అత్యధికంగా పోటీ ఉండడంతో అభ్యర్థులు పుస్తకాలకు అతుక్కుపోయారు. కొందరు కోచింగ్ సెంటర్లలో, మరికొందరు ఇళ్లల్లో పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు.

మెలికలతో పలువురికి నష్టం

కూటమి ప్రభుత్వం నోటిఫికేషన్‌లో ఊహించని విధంగా మెలికలు విధించింది. ఈ మెలికల వల్ల జిల్లాలో దాదాపు 6 వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోలేకపోయారు. రిజర్వుడు అభ్యర్థుల అర్హత మార్కులను 40 శాతానికి తగ్గించి, టెట్‌లో వీరికి ఇచ్చిన నిబంధనల మేరకు డీఎస్సీకి అర్హత మార్కులు తగ్గించినట్టు ప్రకటించింది. అయితే, ఇదే టెట్‌లో జనరల్ అభ్యర్థులకు 45 శాతం మార్కుల నిబంధన ఉన్నా పట్టించుకోకుండా, సుప్రీంకోర్టు తీర్పు, ఎన్‌సీటీఈ గెజిట్‌కు విరుద్ధంగా దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పూర్తి చేసింది. దీంతో దాదాపు 3 లక్షల మంది డీఈడీ, బీఈడీ చేసిన జనరల్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోలేక పోయారు.



డీఎస్సీ వెబ్‌సైట్ చిత్రం

కులాల వారీగా దరఖాస్తులు ఇలా..

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో డీఎస్సీ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న వారిలో కులాల వారీగా పరిశీలిస్తే ఎస్సీ గ్రేడ్-3 అభ్యర్థులు అత్యధికంగా 7,997 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఓసీలో 2,856, బీసీ-ఏలో 4 వేలు, బీసీ-బీలో 3,790, బీసీ-సీలో 101, బీసీ-డీలో 2,570, బీసీ-ఈలో 1,661, ఎస్సీ గ్రేడ్-1లో 4, ఎస్సీ గ్రేడ్-2లో 1,872, ఎస్సీ గ్రేడ్-3లో 7,997, ఎస్టీలో 1,650, ఈడబ్ల్యూఎస్‌లో 1,664, పీహెచ్ పరిధిలో వీహెచ్ 134, హెచ్‌హెచ్ 57, ఓహెచ్ 595, ఎంఐ 11 మంది దరఖాస్తు చేసుకున్నారు.

జులై 9న అంగన్‌వాడీల సమ్మె

తిరుపతి కల్చరల్ : రాష్ట్రంలోని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్తంగా జులై 9వ తేదీన ఒక రోజు సమ్మె చేపడుతున్నట్లు ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ తెలిపారు. వేమన విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీల రాష్ట్ర శిక్షణ తరగతులను శుక్రవారం ఆమె ప్రారంభించి ప్రసంగించారు. వేతనాల పెంపుపై ఏడాది పాటు పెద్ద ఎత్తున సమ్మె చేసినా సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం వేతనాల పెంపుపై ఇప్పటి వరకు జీఓ విడుదల చేయకపోవడం దారుణమన్నారు. జులై 9వతేదీ లోపు అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి మాట్లాడుతూ.. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు కేఎస్ఎస్.ప్రసాదరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.బాలసుబ్రమణ్యం 'యుద్ధం తదనంతర పరిణామాలు, శాస్త్రీయ ఆలోచనా విధానం వంటి అంశాలపై వివరించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నేతలు లక్ష్మీదేవమ్మ, రాజేశ్వరి, ఇంద్రాణి, హైమావతి, సౌజన్య, రేవతి, నాగరాజమ్మ, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

ఒప్పించి కాదు నొప్పించి!

చిత్తూరు కలెక్టరేట్ : అధికారంలోకి రాక ముందు ఒక మాట.. అధికారంలోకి వచ్చాక మరో మాటను అమలు చేయడం టీడీపీకి వెన్నతో పెట్టిన విద్య. ఎన్నికలకు ముందు టీచర్లకు అనేక హామీలు గుప్పించింది. తీరా అధికారంలోకి వచ్చాక హామీల అమలు విషయం దేవుడెరుగు.. క్షేత్ర స్థాయిలో టీచర్ల సమస్యలు, డిమాండ్లను పరిష్కరించకుండా చుక్కలు చూపిస్తోంది. త్వరలో నిర్వహించే ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతుల్లో ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ అన్యాయం చేస్తోంది. దీనిపై ఉపాధ్యాయ లోకం నిప్పులు చెరుగుతోంది.

ఏకపక్ష జీవోలు సరికాదు

కూటమి ప్రభుత్వం ఏక పక్షంగా తీసుకొస్తున్న జీవోలను టీచర్లు తీవ్రంగా తప్పుబడుతున్నారు. గత 30 వారాలుగా రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన యూనియన్లతో సమావేశాలు నిర్వహించి డిమాండ్లను సేకరించినప్పటికీ అమల్లోకి తీసుకొకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. డిమాండ్లను పరిగణనలోకి తీసుకోకుండా అమల్లోకి తీసుకొచ్చిన 19, 20, 21 జీవోలను వ్యతిరేకిస్తున్నట్లు తేల్చిచెబుతున్నారు. ఉపాధ్యాయ సంఘాలను ఒప్పించి చేస్తున్నామంటూ అపోహలు సృష్టించి.. నొప్పించే ధోరణితో వ్యవహరిస్తున్నారని దుయ్యబడుతున్నారు.

21న డీఈఓ కార్యాలయం ముట్టడి

డిమాండ్ల పరిష్కారానికి ఈ నెల 21న ఉమ్మడి జిల్లా డీఈఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రకటించింది. కూటమిపై పోరాటానికి అన్ని సంఘాలు కలిసి వచ్చినట్టు పేర్కొన్నాయి.

స్నేహితుడిపై అలిగి ఆత్మహత్య

తిరుపతి క్రైమ్ : నగరంలో నివాసం ఉంటున్న ఓ యువకుడు స్నేహితుడిపై అలిగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. అలిపిరి ఎస్ఐ లోకేష్ తెలిపిన వివరాల మేరకు... నెల్లూరు జిల్లాలోని విడవలూరుకు చెందిన అనిల్ కుమారుడు వివేక్(21) తిరుపతిలోని సత్యనారాయణపురంలో క్యాటరింగ్ పనులు చేసుకుంటూ నివాసం ఉంటున్నాడు. అయితే తోటి స్నేహితుడితో చిన్నపాటి మనస్పర్ధలు రావడంతో తీవ్రమైన మనస్తాపానికి గురై రూమ్ లో ఎవరూ లేని సమయంలో పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్నేహితులు వెళ్లి వివేక్‌ని పిలవగా కదలకుండా పడి ఉండడంతో అనుమానం వచ్చి అలిపిరి పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లుగా వైద్యులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెడికల్ కళాశాలకు తరలించారు.

ఘనంగా సంకటహర చతుర్థి

కాణిపాకం: శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానంలో శుక్రవారం సంకటహర చతుర్థి గణపతి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. చతుర్థి సందర్భంగా ఉదయం ప్రధాన ఆలయంలోని అలంకార మండపంలో సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామి ఉత్సవ విగ్రహాలకు సుగంధ పుష్పాలతో అలంకరణ చేసి.. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రేపు అండర్-19, 23 క్రికెట్ జిల్లా జట్ల ఎంపికలు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ (సీడీసీఏ) ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీ ఉదయం 9 గంటలకు తిరుపతి మంగళం రోడ్డులోని సీవీ క్రికెట్ అకాడమీలో అండర్-19, 23 బాలుర క్రికెట్ జిల్లా జట్ల ఎంపిక చేపట్టనున్నారు. ఈ మేరకు సీడీసీఏ అధ్యక్షుడు విజయకుమార్, కార్యదర్శి రవికుమార్ ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4న తిరుపతిలో నిర్వహించాల్సిన ఎంపిక ప్రక్రియ వర్షం వల్ల రద్దయ్యిందని, 18వ తేదీన ఎంపిక ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. అండర్-19 విభాగంలో ఎంపికకు వచ్చే వారు 2006 సెప్టెంబర్ 1, అండర్-23 విభాగంలో 2002 సెప్టెంబర్ 1 తర్వాత జన్మించిన వారు అర్హులని తెలిపారు. తెల్లని దుస్తులు, సొంత క్రీడా సామగ్రి, ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం తీసుకురావాలని పేర్కొన్నారు. వివరాలకు సీడీసీఏ కోచ్ సునీల్‌కుమార్‌ను 90002 14966, సీడీసీఏ సంయుక్త కార్యదర్శి సతీష్‌యాదవ్‌ను 88861 85559 లో సంప్రదించాలని వారు కోరారు.

ఫైనాన్స్ కంపెనీ వేధింపులపై ఫిర్యాదు

ఏర్పేడు : ప్రైవేటు మైక్రో ఫైనాన్స్ కంపెనీ సిబ్బంది వేధింపులపై ఏర్పేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని నచ్చనేరి గ్రామానికి చెందిన రమేష్ ఏడాది కిందట శ్రీకాళహస్తిలోని ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీ నుంచి రూ.5 లక్షలు హౌసింగ్‌లోన్ తీసుకున్నట్లు తెలిపారు. నెలసరి వాయిదా మొత్తం ప్రతి నెలా రూ.12,560 సక్రమంగా చెల్లిస్తున్నట్లు తెలిపారు. అయితే ఈనెల 5వ తేదీనే గడువు లోపల నెలసరి వాయిదా మొత్తం రూ.12,560 ఏజెంట్‌కు ఆన్‌లైన్ పేమెంట్ చేసినట్లు చెప్పారు. అయితే బుధవారం రాత్రి ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధి యుగంధర్ ఈనెల 14వ తేదీన బుధవారం రాత్రి ఫోన్ చేసి తనను అసభ్య పదజాలంతో దూషించడమే కాకుండా 15 మంది రౌడీలను తీసుకుని నచ్చనేరిలోని తన ఇంటికి రాత్రి వేళలో వచ్చి తాను ఇంట్లో లేని సమయంలో ఇళ్లంతా వెతికి, తన కుమార్తె బాత్‌రూములో స్నానం చేస్తుంటే మీ నాన్న లోపల దాక్కొని ఉన్నాడు.. తలుపు తీయ్ అని గట్టిగా అరుస్తూ తలుపులు తడుతూ కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురి చేసినట్లు వాపోయాడు. ఈ ఘటనపై ఏర్పేడు పోలీసులకు ఫిర్యాదు చేశానని, తనకు న్యాయం చేయాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

ఆగి ఉన్న లారీని ఢీకొని..

- తమిళనాడు యువకుడు మృతి

చంద్రగిరి : సర్వీసు రోడ్డుపై ఆగి ఉన్న లారీను ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో తమిళనాడుకు చెందిన యువకుడు మృతి చెందిన ఘటన పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి రాయలపురం సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. తమిళనాడులోని కాడ్పాడికి చెందిన ప్రసన్న(26) వ్యక్తిగత పనుల నిమిత్తం తన బుల్లెట్ వాహనంపై తిరుపతికి పయనమయ్యాడు. రాయలపురం సమీపంలో వస్తున్న క్రమంలో దాబా వద్ద ఆగి ఉన్న లారీను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్రసన్న మృత్యువాత పడ్డాడు. వెంటనే తేరుకున్న లారీ డ్రైవరు లారీతో సహా అక్కడ నుంచి పారిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మృతి చెందిన ప్రసన్న

పోలీసుల నిర్లక్ష్యంగానే ప్రమాదాలు

జాతీయ రహదారిపై ఉన్న దాబాల వద్ద అనధికారికంగా భారీ వాహనాలను పార్కింగ్ చేయడం వలనే తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రమాదాలను నిలువరించేందుక సరైన చర్యలు తీసుకోకుండా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ద్వారానే ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ దాబాల వద్ద జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీను ఢీకొనడం ద్వారా ఇద్దరు అమాయకులు ప్రాణాలు పోగొట్టుకున్నారని గుర్తు చేస్తున్నారు. రహదారికి ఆనుకుని ఉన్న దాబాల యజమానులు ప్రతి నెలా పోలీసు శాఖలోని కొంత మందికి మామూళ్లు అందించడంతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

రసవత్తరంగా కుస్తీ పోటీలు

జిల్లా కేంద్రంలో రాష్ట్ర స్థాయి పోటీలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని మెసానికల్ మైదానంలో రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలు శుక్రవారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో పాల్గొన్న వివిధ జిల్లాల క్రీడాకారులు నువ్వా...నేనా అన్నట్టు తలబడ్డారు. ఈ పోటీలకు రాష్ట్ర స్థాయిలోని వివిధ జిల్లాల నుంచి అండర్-17, అండర్-23 విభాగాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. మొదటి రోజు ప్రారంభమైన ఈ పోటీల్లో వివిధ జిల్లాలకు చెందిన అండర్ 17 బాల, బాలికల కుస్తీ క్రీడాకారులు తలబడ్డారు. ఈ నెల 17న నిర్వహించే పోటీల్లో అండర్ 23 బాల, బాలికల జట్ల క్రీడాకారులు పాల్గొననున్నారు.

దర్జాగా దోపిడీ

- ప్రకృతి సంపద విధ్వంసం
- కోట, చిట్టేడులో ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణా
- సాగరమాల పేరుతో అక్రమాలు
- రెచ్చిపోతున్న కూటమి నేతలు
- మామూళ్ల మత్తులో అధికారులు

చిల్లకూరు : కూటమి ప్రభుత్వంలో ప్రకృతి సంపద విధ్వంసం అవుతోంది. ఎక్కడ ఇసుక, గ్రావెల్ ఉందో అక్కడ పచ్చనేతలు వాలిపోతున్నారు. నియోజకవర్గంలో కోట మండలంలో గ్రావెల్, ఇసుక అక్రమ మార్గంలో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రెవెన్యూ, పోలీసు, గనులశాఖ అధికారులకు తంచనుగా ముడుపులు అందుతుండడంతో అటువైపు కన్నెత్తి చూడడంలేదనే విమర్శలు గుప్పుమంటున్నాయి. కోట మండలంలోని పలు గ్రామాల్లో గ్రావెల్ విరివిగా లభిస్తోంది. ఇక స్వర్ణముఖి నది నుంచి ఇసుక విస్తారంగా దొరుకుతోంది. గతంలో ఇసుకను అక్రమంగా తరలిస్తే ఆయా ప్రాంతాల్లోని వారు భూగర్భ జలాలు అడుగంటి పోతాయని గగ్గోలు పెట్టేవారు. నేడు కూటమి ప్రభుత్వంలో అలా ఎవరైనా గగ్గోలు పెట్టేందుకు ప్రయత్నిస్తే వెంటనే కేసులు పెట్టి లోపలేస్తున్నారు.


గూడలి ప్రాంతంలో ఇసుకను తవ్వి టిప్పర్లకు లోడ్ చేస్తున్న యంత్రాలు యథేచ్ఛగా చెన్నైకు తరలింపు

కోట మండలంలో గూడలి ప్రాంతంలో ఇసుక రీచ్ ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి పేదల పేరుతో తవ్వకాలు చేపట్టిన కూటమి నేతలు యథేచ్ఛగా చెన్నైకి తరలించి రూ.లక్షలు గడిస్తున్నారు. ప్రతిరోజు టన్నుల కొద్దీ ఇసుకను టిప్పర్ల ద్వారా తరలిస్తున్నా గనుల శాఖ అధికారులకు నెలనెలా మామూళ్లు నేరుగా కార్యాలయానికి చేరుతుండడంతో మిన్నుకుండిపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

సాగరమాల రహదారి నిర్మాణం సాకుగా..

తవ్విన గ్రావెల్‌ను సాగరమాల రహదారి నిర్మాణం పేరుతో ప్రైవేట్ లే అవుట్‌లకు తోలుకుని రూ.లక్షలు వెనకేసుకుంటున్నారు. సాగరమాల రహదారి నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టు సంస్థలు తమకు ఎక్కడ అనువుగా ఉంటుందో అక్కడ గ్రావెల్‌ను తవ్వి తరలించేస్తున్నారు. ఇలా లక్షల రూపాయలు ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నా అడిగే దిక్కే లేకుండాపోయింది.

పేదల భూములు స్వాధీనం చేసుకొని..

చిట్టేడు, రుద్రవరం, ఊనుగుంటపాళెం, మైక్రోటవర్ కాలనీ ప్రాంతాల్లో పేదల భూములపై కన్నేసిన కూటమి నేతలు వారికి నామమాత్రంగా నగదు చెల్లించి భూములు స్వాధీనం చేసుకున్నారు. ఆ భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా గ్రావెల్ తరలించి పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నారు. సాధారణంగా ఆ భూముల్లో మూడు మీటర్ల మేర మాత్రమే తవ్వకాలు చేపట్టాల్సి ఉండగా నిబంధనలకు విరుద్ధంగా 30 నుంచి 50 అడుగుల మేర తవ్వకాలు చేపట్టి లక్షల టన్నుల గ్రావెల్‌ను అక్రమంగా తరలించి రూ. లక్షలు దోచేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఇష్టానుసారంగా తవ్వకాలు చేపట్టడంతో ఆ ప్రాంతంలో వేసిన 11 కేవీ విద్యుత్ స్తంభాలు సైతం వాలిపోయి ప్రమాదకరంగా మారాయి.


గ్రావెల్ తవ్వకాలతో ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

అక్రమార్కులకు వంతపాడుతూ..

చిట్టేడు ప్రాంతంలో భారీ ఎత్తున గుంతలు ఏర్పడేలా గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్నారు. వీరికి ఎవరు అనుమతి ఇచ్చారని రెవెన్యూ అధికారులను ప్రశ్నిస్తే తాము పరిశీలించి గనుల శాఖకు పంపడం జరిగిందంటూరు. గనులశాఖ అధికారులను అడిగితే తాము అనుమతులు ఇవ్వలేదని చెబుతూ రెవెన్యూ వారు చూసుకోవాలని వారి మీదకు తోసేస్తున్నారు. ఇలా ఒకరిపై మరొకరు చెప్పుకుంటూ అక్రమార్కులకు ఇరుశాఖల అధికారులు వంత పాడుతున్నారు.

తనిఖీలు చేస్తాం

చిట్టేడు , రుద్రవరం ప్రాంతాలలోని పేదల భూములలో గ్రావెల్ తవ్వకాల కోసమని అనుమతి కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం గనుల శాఖకు సిఫార్సు చేశాం. అయితే అనుమతులు ఇచ్చినట్లు తమ కార్యాలయానికి ఎలాంటి పత్రాలను పంపలేదు. అయితే నిబంధనలకు వ్యతిరేకంగా తవ్వకాలు చేస్తున్నట్లు సమాచారం వచ్చింది. గనులశాఖ అధికారులతో కలసి తనిఖీ చేసి చర్యలు చేపడతాం.

– జేజే రావు, తహసీల్దార్, కోట మండలం